క్లుప్తంగా

ఎన్నికల నియమావళిని పాటించాలి

తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. తిరువూరు మండలంలోని వామకుంట్ల, అక్కపాలెం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని, బహిరంగ ప్రదేశాల్లో ముందస్తు అనుమతి తీసుకుని మాత్రమే ప్రచారాలు చేసుకోవచ్చన్నారు. గతంలో పోలీసు కేసుల్లో ఉన్న పాత నేరస్తులు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, వివాదాల్లో తలదూరిస్తే జైలుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తిరువూరు పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వాహనాల తనిఖీ..

తిరువూరు సమీపంలోని ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సమీకృత ఎన్నికల చెక్‌పోస్టులో ఆదివారం సాయంత్రం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమతికి మించి నగదు తీసుకెళ్లినా, మారణాయుధాలు తరలిస్తున్నా, అక్రమంగా మద్యం తీసుకెళుతున్నా వాహనాలను సీజ్ చేస్తామని సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

ఇళ్ల వద్దే పింఛన్ అందించేలా చూడాలి

మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

నూజివీడు: పింఛన్ నగదును పంపిణీ చేయడానికి వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలపై పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఎన్నికల సంఘాన్ని కోరారు. నూజివీడులో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే లబ్ధిదారులకు పింఛన్ అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమం గత నాలుగేళ్లుగా సాఫీగా సాగుతుంటే, పాత విధానాన్ని అడ్డుకోవడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, వికలాంగులు పింఛన్ కోసం కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడే అవకాశముందని, ఎన్నికల సంఘం పునరాలోచించి ఎప్పటిలాగే పింఛన్లను పంపిణీ చేయాలని కోరారు. అలా కాకుంటే ఎన్నికల సంఘం పరిధిలో లక్షలాది మంది సిబ్బంది ఉన్నందున వారితో పింఛన్‌దారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదును అందజేయాలన్నారు. ఈ రోజున వృద్ధులు పోలింగ్ బూత్‌కు రాకుండానే ఇంట్లోనే ఉండి ఓటేయవచ్చని చెప్పే ఎన్నికల సంఘం, పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్‌గా శివరాజు ఊహ



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థిని శివరాజు ఊహ ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్‌గా ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన సామాజిక సేవను గుర్తించి జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి గాను యూనివర్సిటీ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఎంపిక చేశారని చెప్పారు. ఈ అవార్డును జేఎన్‌టీయూ, కాకినాడ ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు ద్వారా మార్చి 27న అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శివరాజు ఊహను, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివ హరిప్రసాద్‌ను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి. శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

నవోదయకు విద్యార్థినుల ఎంపిక

ఆగిరిపల్లి: సీతారాంపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చిత్తలూరు దీక్షిత, అత్తి తనుశ్రీ, నవోదయకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పేరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, సర్పంచ్ అత్తి మురళీమోహన్, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరం

తిరువూరు: వేసవిలో దాహార్తి తీర్చుకోడానికి శీతల పానీయాలను ఆశ్రయించవద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక ఎస్ఆర్ టవర్స్ సెంటర్‌లో ఆదివారం శీతల పానీయాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ జనవిజ్ఞాన వేదిక రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కొబ్బరినీళ్లు, నిమ్మరసం, లస్సీ వంటి సహజ పానీయాలు తీసుకోవాలని, శీతల పానీయాలతో దంతాలు పాడవడంతోపాటు జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సభ్యులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, నాగ శిరోమణి పాల్గొన్నారు.

మరణాన్ని జయించిన ఏసుక్రీస్తు

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్
- చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు

తిరువూరు: సర్వ మానవాళి రక్షణ కోసం సిలువపై మరణించి మూడో రోజు పునరుత్థానుడైన ఏసుక్రీస్తు మరణాన్ని జయించారని పలువురు పాస్టర్లు తెలిపారు. తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ఈస్టర్ పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు ప్రసంగిస్తూ ఈస్టర్ ప్రాధాన్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం పలుచోట్ల అన్నదానం చేశారు. ఏసుక్రీస్తు పునరుత్థాన దినమైన ఈస్టర్ పండుగ సందర్భంగా తిరువూరు పట్టణంలోని పలు చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, దయ, త్యాగం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని తిరువూరు టౌన్ సీఎస్ఐ చర్చి ఫాదర్ కందుల దిలీప్ అన్నారు. ప్రార్థనల్లో సంఘ కాపరులు జాన్ స్పర్జన్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- **చాట్రాయి:** ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగ ఈస్టర్‌ను మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా చర్చిల్లో ప్రార్థనలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.
- **గంపలగూడెం:** పవిత్ర ఈస్టర్ దినోత్సవాన్ని గంపలగూడెం మండలంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గంపలగూడెం, తోటమూల, పెనుగొలను, ఊటుకూరు, అమ్మిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లోని చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ప్రార్థనా మందిరాల పాస్టర్లు ఈస్టర్ దినోత్సవం విశిష్టతను, క్రీస్తు పునరుత్థానం అయిన తీరును వివరించారు. క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి తోటివారికి సహాయం చేయాలని సూచించారు.

రెడ్డిగూడెం మండలంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి గ్రామంలో క్రైస్తవులు తెల్లవారు జాము నుండే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి సమాధిలో నుంచి లేచారని విశ్వాసులు ఆనంద గీతాలు పాడుతూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. రెడ్డిగూడెం సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో రెవరెండ్ జి. విశ్వనాథ్ దైవ సందేశం ఇచ్చారు. ఏసుక్రీస్తు మృతి చెంది మూడో రోజు సమాధిలో నుంచి లేచారని, ఇది గొప్ప పరిణామం అని చెప్పారు. మండలంలోని వెలగలగూడెం విచారణ ఆర్‌సీఎం చర్చిలో అర్ధరాత్రి దివ్యపూజా బలి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ దానియేలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మూడో రోజు సమాధిలో నుంచి లేచారని, మానవులు అందరిని రక్షించేందుకు, పరలోకంలోకి నడిపించేందుకు ఏసుక్రీస్తు మరణించి మూడో రోజు మృత్యుంజయుడుగా లేచారన్నారు. మనందరిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేందుకు దేవుడు మనకు ఒక మార్గాన్ని దయ చేశారన్నారు. మనలోని పాత జీవితాన్ని పారద్రోలి కొత్త జీవితంలోకి అడుగు పెట్టాలని చెప్పారు. మండలంలోని పలు దేవాలయాల్లో ఈస్టర్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉపదేశకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



తిరువూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- **ఏ.కొండూరు:** మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కృష్ణారావుపాలెం, కోడూరు, కంభంపాడు, పోలిశెట్టిపాడు, రేపూడి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు మాట్లాడుతూ ప్రేమ, శాంతి అహింసా మార్గంలో మానవాళి యావత్ నడుచుకోవాలని క్రీస్తు చేసిన బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు.
- **ఇబ్రహీంపట్నం:** మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు క్రీస్తు పునరుత్థానం (ఈస్టర్) వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సీఎస్ఐ, ఆర్‌సీఎం, పెంతెకోస్తు తదితర చర్చిలకు వేకువజామున క్రైస్తవ భక్తులు చేరుకున్నారు. మతాధికారులు ఏసుక్రీస్తు సిలువ వేయబడి మూడోరోజు లేచిన పునరుత్థాన ఘట్టాలను వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మూలపాడు, కీలేశపురం గ్రామాల్లోని కొండలపై ఉన్న సిలువల వద్ద ప్రత్యేక ప్రార్థన జరిపారు. పాపసంకీర్తనం చేసిన భక్తులకు దివ్యసప్రసాదం అందజేశారు. పలు చర్చీల్లో భక్తులకు అన్నదానం చేశారు.
- **ముసునూరు:** మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచే ఉజ్జీవ కీర్తనలు, బైబిలు పఠనాలు, క్యాండిల్ వెలుగుల్లో పరస్పర ఆలింగనాలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రమణక్కపేట, ముసునూరు, కాట్రేనిపాడు విచారణల ఫాదర్లు జోసఫ్‌తంబి, జాన్‌భారతి, ఇమ్మానియేలు, సహాయ గురువులు గాంధీరాజ, రాజశేఖర్, సుమిత్, ప్రవీణ్ ప్రత్యేక దివ్య బలి పూజను సమర్పించి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్, న్యూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల అధినేతలు కంబాల రాంబాబు, టి.రూబేన్ వరకుమార్, పాస్టర్లు, సంఘకాపరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్ని చర్చీల వద్ద ప్రేమవిందులు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు.
- **ఆగిరిపల్లి:** మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. ఆగిరిపల్లి బెత్లెహేం చర్చిలో పాస్టర్ దైవ నిరీక్షణ కుమార్, కనసానపల్లి, అడవినెక్కలంలో పాస్టర్ శశిధర్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు.

ఏసుక్రీస్తు జీవితం త్యాగానికి చిహ్నం

–సర్నాల తిరుపతిరావు

మైలవరం: ఏసుక్రీస్తు జీవితం త్యాగానికి చిహ్నం అని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా మైలవరంలోని సీయోను అసెంబ్లీ చర్చిని ఆదివారం ఆయన సందర్శించి ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తును సిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు నుంచి మూడో రోజు క్రీస్తు పునరుత్థానుడై లేచారని, ఈరోజును క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారన్నారు. ఈ రెండు ఘటనలు మానవాళి చరిత్రను మలుపు తిప్పాయని చెప్పారు. దైవ సేవకులు పరంజ్యోతి ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. ఈస్టర్ పండుగను మైలవరంలో విశ్వాసులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే క్రీస్తు దేవాలయాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. క్రీస్తు మార్గంలో నడవాలని దైవ సేవకులు తమ సందేశంలో పేర్కొన్నారు.



రెడ్డిగూడెం సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ జి. విశ్వనాథ్



మైలవరం చర్చిలో విశ్వాసులతో మాట్లాడుతున్న తిరుపతిరావు



తిరువూరు టౌన్ సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు



ఊటుకూరులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు



ముసునూరు ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధన

ముమ్మరంగా వాహనాల తనిఖీ



చాట్రాయి: ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, నగదు తరలింపును అడ్డుకునేందుకు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆయన చాట్రాయి–పోలవరం గ్రామాల మధ్య వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లే పక్షంలో సంబంధిత ఆధారాలు తప్పకుండా ఉండాలన్నారు.

- **నూజివీడు:** ఎన్నికల నిబంధనలను ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు పాటించాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ అన్నారు. తుక్కులూరులో ఆదివారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.50 వేల కంటే ఎక్కువ నగదును ప్రయాణ సమయంలో తరలించేటప్పుడు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని, బంగారు నగలు, వెండి ఆభరణాలను సైతం పెద్ద మొత్తంలో వెంట తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు.
- **ముసునూరు:** రూ.50 వేల కన్నా అధిక నగదు అక్రమంగా తరలిస్తే వాహనం సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలోని స్క్వాడ్ సభ్యులు ముసునూరు నేలపాటివారికుంట, వలసపల్లిలోని అంతర జిల్లా చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని సోమవారం ప్రారంభిస్తామని పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు మాజీ సభ్యుడు చందా చంటి ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సోమవారం ఉదయం పట్టణంలో పర్యటిస్తారన్నారు. సాయంత్రం ఎంపీ కేశినేని నానితో కలిసి కార్యాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమాలలో పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎంపీ కేశినేని నాని, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- రామరాజ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల మేలు కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం చేకూర్చాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వారు గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధి రామరాజ్యనగర్‌లో స్థానిక ఎంపీటీసీ సంద్యాల దుర్గారావు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. గడిచిన 58 నెలల కాలంలో 130 సార్లు బటన్ నొక్కి డీబీటీ ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి నిలబెట్టేందుకు వచ్చే ఎన్నికల్లో రెండు బటన్‌లు (ఒకటి ఎంపీ, ఒకటి ఎమ్మెల్యే) నొక్కాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తగులుతుంది

ప్రతి నెలా ఒకటో తేదీ వేకువ జాము నుంచే అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ పేషెంట్లకు వలంటీర్లు అందించే పింఛన్ల విషయంలో వలంటీర్ల జోక్యం ఉండకూడదంటూ నిమ్మగడ్డ రమేష్ చౌదరి అనే వ్యక్తితో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించిన చంద్రబాబుకు వారి ఉసురు తగిలితీరుతుందని ఎంపీ నాని అన్నారు.

వలంటీర్ వ్యవస్థను దేశవ్యాప్తంగా ప్రశంసిస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అండ్ కో దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు.



రామరాజ్యనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు

ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి

పింఛన్ తీసుకునేందుకు ఎదురు చూస్తున్న అవ్వాతాతలు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ విషయంలో ఈసీ పునరాలోచించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల యుద్ధంలో కూటమికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గొల్లపూడి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాన్యుడిని ఎమ్మెల్యేగా గెలిపించండి

ఇబ్రహీంపట్నం: సామాన్యులకు సైతం అధికారం దక్కాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావును ఎంపిక చేశారని మైలవరం నియోజకవర్గ అదనపు పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తిరుపతిరావు గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగింది. పార్టీ అభ్యర్థి తిరుపతిరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదల పార్టీగా ఉన్న వైఎస్సార్ సీపీలో సామాన్యులను అధికారంలో భాగస్వామ్యం చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది సామాన్యులకు టిక్కెట్లు ఇచ్చారన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే పోటీలో మన అభ్యర్థి తిరుపతిరావుకు విజయం చేకూర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామాల పర్యటనలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో విజయం సాధిస్తామనే నమ్మకం కలిగిందని చెప్పారు. ఈ సందర్భంగా పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డిని మెమెంటోతో సత్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, బొంతా సాంబశివరావు, మిక్కిలి శరభయ్య, గుంజా శ్రీనివాస్, నల్లమోతు బోసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

అంకమ్మతల్లి దేవర ఉత్సవంలో పాల్గొన్న సర్నాల..

మైలవరం: మైలవరం గ్రామంలోని అంకమ్మ తల్లి దేవర ఉత్సవంలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఆదివారం పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు, తన విజయానికి ఆ తల్లి దీవెనలు ఉంటాయన్నారు. ఉత్సవానికి వచ్చిన బంధుమిత్రులు, స్నేహితులను కలుసుకున్నారు. అందరూ ఐకమత్యంతో పనిచేసి మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరే విధంగా కృషి చేయాలన్నారు. మీ బిడ్డగా, మీ తమ్ముడిగా, అన్నగా తనను ఆశీర్వదించి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో 40 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో నల్లగట్ల స్వామిదాసు తదితరులు

గోసవీడు(గంపలగూడెం): మే నెలలో జరగనున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గోసవీడులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

తొలుత గ్రామంలోని 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరడంతో వారికి స్వామిదాసు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. స్వామిదాసు మాట్లాడుతూ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, సాని కొమ్ము రాజగోపాల్‌రెడ్డి, బి. కోటిరెడ్డి, సర్పంచ్ కందిమల్ల ప్రశాంత్, చావా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన వృక్షం



చింతలవల్లి (ముసునూరు): బాటసారులకు, పశువుల కాపరులకు, గ్రామస్తులకు నీడనిచ్చి, పశుపక్ష్యాదులకు ఆశ్రయంగా నిలిచిన వందేళ్లనాటి మర్రి వృక్షం నేలకూలింది. చింతలవల్లిలో పాత సచివాలయానికి ఎదురుగా, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద ఉన్న మర్రి చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు, ఇళ్లకు అడ్డు వస్తున్నాయని గత ఏడాది ఒక వైపున నరికివేశారు. వాటర్ ట్యాంకు నుంచి వెళ్లే నీరు చెట్టు మొదలుకు చేరడంతో నానిపోయి, ఒకవైపే బరువు అధికం కావడంతో ఆదివారం ఈ వృక్షం రహదారిపై నేలకూలింది. ఆర్అండ్‌బీ అధికారులు రహదారికి అడ్డుగా పడిన కొమ్మలను తొలగించారు.

పండ్లు, రొట్టెల పంపిణీ



మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చ్ గిఫ్ట్ గాస్పెల్ టీమ్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఆదివారం పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ మనష్షే మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించిన రోజును పునరుత్థాన దినంగా అందరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభువు పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎడ్వర్డ్ రత్నాకర్, విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆనందీబాయి జోషి జయంతి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో భారత దేశ మొదటి పాశ్చాత్య మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. భర్త సహకారంతో అమెరికాలో వైద్య విద్యను అభ్యసించి 1866 మార్చి 11న డాక్టరేట్ సాధించారని పలువురు తెలిపారు. ఎందరో మహిళలకు ఆనందీబాయి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ఎం. జనార్దన్‌రెడ్డి, దేవర శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ప్రత్యేక ప్రార్థనలు

కాట్రేనిపాడు(ముసునూరు): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ పార్టీ నియోజకవర్గ నేతలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జెడ్పీటీసీ డా. వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో కాట్రేనిపాడు సీఎస్ఐ హోలీ నూతన మందిర పాస్టర్ కంబాల రాంబాబు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలవాలని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించారు. పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.